చిన్న కాళేశ్వరం పంప్ హౌస్

పనులు పూర్తిచేయాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

చిన్న కాళేశ్వరం పంపౌస్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

మహదేవపూర్/కాళేశ్వరం, మార్చి 19 : చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు. అనంతరం మండలంలోని బీరసాగర్ గ్రామంలో చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పంప్ హౌస్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 45 వేల ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. పంప్ హౌస్‌లో మూడు మోటర్ల మరమ్మతులు జరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 65 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. రానున్న వానకాలం లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈలు తిరుపతిరావు, యాదగిరి, ఏఈ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా..

బోడ అనిల్‌కుమార్‌నాయక్

మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌నాయక్

ములుగురూరల్, మార్చి19 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని బోడ అనిల్‌కుమార్‌నాయక్ అన్నారు. మంగళవారం ములుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట మండలం ఏనుగులతండా గ్రామానికి చెందిన తాను అధ్యాపకుడిగా పనిచేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చట్టసభల్లో స్థానిక సమస్యలను వివరించేందుకు పార్టీలతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు చెప్పారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కకుండా నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే శక్తిగా తయారయ్యేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తాను 17వేల మంది యువకులతో సమావేశం నిర్వహించానన్నారు. గిరిజన బిడ్డగా ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి సామగ్రి దగ్ధం

కృష్ణకాలనీ, మార్చి 19 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి టీ-2 191 క్వార్టర్‌లో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. క్వార్టర్‌లో నివాసముంటున్న శ్రీనివాస్‌రావు కుటుంబం వంట చేసుకోవడానికి స్టవ్ వెలిగిస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై సిలిండర్‌లో నుంచి భారీగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీయగా సిలిండర్ పేలి ఇంట్లోని బీరువా, టీవీ, మంచాలు, కూలర్ తదితర వస్తువులు కాలిపోయాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు పోన్ చేయగా వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే పూర్తిగా కాలిపోయాయని బాధితులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

టేకుమట్ల, మార్చి 19 : గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన అడ్డూరి కార్తీక్ (23) మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ వారం రోజుల క్రితం అనారోగ్య కారణంతో ఇంట్లో గట్టి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంట దవాఖానకు, అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కాగా మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్, సట్ల కొమురయ్య తదితరులు పరామర్శించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, **PAMU JYOTHI, W/o. PAMU SRINIVASU,** R/o. H.No. 2-1-666, Gopalapur Cross Road, Vidyaranyapuri Hanumakonda- 506009, changed my name as **RAPOLU JYOTHI, W/o. PAMU SRINIVASU.** Hence forth I shall be called as **RAPOLU JYOTHI, W/o. PAMU SRINIVASU** for all the Purpose.
NTW-14312

CHANGE OF NAME
★I, **DASARI MADHAVI** (Old Name), R/o. H.No. 1-7-105/2, Revenue Colony, Subedari, Hanam konda. 506001, Have changed my Name as **PONUGOTI MADHAVI** (New Name) for all purpose.
NTW-14313

ఉచిత వైద్య శిబిరం
★మార్చి 22, 23 శుక్ర, శనివారం ఉచితంగా డెంటల్ OP చూడబడును. ఉచితంగా డెంటల్ మందులు ఇవ్వబడును. యోగనంద హాస్పిటల్, DLR గార్డెన్ ప్రక్కన, ములుగు. సెల్: 7901234546.
NTW-00

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

రంగులతో అలంకరించిన రామాలయం

22న కోదండ రామాలయంలో శిఖర ప్రతిష్ఠాపన

ఏటూరునాగారం, మార్చి 19 : మండలకేంద్రంలోని కోదండ రామాలయ శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయంతో పాటు కల్యాణ మండపానికి రంగులు వేశారు. పరిసరాల్లో మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీంతో పాటు ఆలయ ఆవరణలో శ్రీ కృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపన కూడా చేయనున్నారు. 21న ఉదయం 7 గంటలకు జలధివాసంతో కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. 22న 7గంటలకు గురు ప్రార్థన, చతుస్థాన మండపార్చన, అగ్ని ప్రతిష్ఠాపన, 10:02 గంటలకు శిఖర ప్రతిష్ఠాపనోత్సవం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కాళేశ్వరం వంతెనపై పోలీసుల నాకా బందీ

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వాహనాల తనిఖీ

కాళేశ్వరం, మార్చి 19 : కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెనపై మంగళవారం స్థానిక ఎస్సై భవానీ సేన్ ఆధ్వర్యంలో నాకా బందీ చేపట్టారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని పరిశీలించి, అనుమనితులను విచారించి పంపుతున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గామాల్లో కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దన్నారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

బీరసాగర్‌లో కార్డన్ సర్చ్

మహదేవపూర్ మండలం కన్నెపల్లి జీపీ పరిధి బీరసాగర్‌లో మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై భవానీ సేన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ తనిఖీలు చేశారు. అనంరతం గ్రామస్తులతో మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి
- అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలి
- భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి
- పదో తరగతి ఎగ్జామ్ సెంటర్ల తనిఖీ

ములుగు రూరల్ : పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, మార్చి 19 : పదో తరగతి పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ భవేశ్ మిశ్రా, ములుగు జిల్లా కేంద్రంలోని సెంటర్లను ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సౌకర్యాన్ని కల్పించడంతో పాటు విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే వైద్య సేవలందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, జవాబు పత్రాలను తహసీల్దార్, ఎంపీడీవోల క్లోస్డ్ వాహనాల్లో పోలీసు బందోబస్తు మధ్య తరలించాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించొద్దని, విద్యార్థులు, సిబ్బందిని నిశితంగా పరిశీలించిన తర్వాతే సెంటర్‌లోకి అనుమతించాలని కలెక్టర్లు సూచించారు. వారి వెంట భూపాలపల్లి డీఈవో ఎన్ రాంకుమార్, ములుగు పరీక్షల సహాయ నియంత్రణాధికారి అప్పని జయదేవ్, చీఫ్ సూపరిండెంట్ తిరుపతి, డీవో రవీందర్ ఉన్నారు.

ఏజెన్సీ చట్టాలను కాలరాస్తున్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

తాడ్వాయి, మార్చి19 : ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయకుండా అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబెల్లి గణేశ్ ఆరోపించారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ తీసుకొచ్చి ఐటీడీఏను ఏర్పాటు చేస్తే అడ్మినిస్ట్రేషన్ అధికారాలను కూడా అధికారులు తమ చేతుల్లోకి తీసుకుని ఐటీడీఏ పరిపాలనా అధికారిని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం స్టాఫ్‌నర్సుల నియామకంలో ఆదివాసీలకు డీఎంహెచ్‌వో తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. గెజిటెడ్ ఆఫీసర్ పోస్ట్ తప్ప మిగతా ఉద్యోగాలన్నీ సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేటర్ ప్రాజెక్ట్ అధికారి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉండగా కలెక్టర్, డీఎంహెచ్‌వో నోటిఫికేషన్ ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. ఎన్ఎంహెచ్ గైడ్‌లైన్స్ ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాలోని పోస్టులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌తో భర్తీ చేయాలని జీవో నంబర్ 68ను అమలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ గైడ్‌లైన్స్ జారీ చేసినా వాటిని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు జిల్లాలో 68జీవోకు విరుద్ధంగా నోటిఫికేషన్‌ను జారీ చేశారన్నారు. జిల్లాకు ఆదివాసి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా హక్కులు మాత్రం అమలు కావడం లేదన్నారు. ఆదివాసీ హక్కులకు భగం కలిగేలా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

డ్రమ్ముల్లో నిల్వచేసిన ఇప్పపువ్వు, బెల్లం పానకాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వాజేడు, మార్చి,19 : మండలంలోని మొరుమురుకాలనీ గ్రామ శివారు అల్లివాగు, గుండ్లవాగు పరిసరాల్లోని అటవీ ప్రాంతంలోని గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎస్సై చవ్వాళ్ల వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 62 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో 4,100 లీటర్ల ఇప్పపువ్వు, బెల్లం పానకం నిల్వలను పోలీసులు పారబోశారు. 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెల్లం హరీశ్, చింత సమ్మయ్య, తాటి శుక్రమ్, నక్క చంద్రశేఖర్, తెల్లం లక్ష్మయ్య, కుర్సం శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గుడుంబా అమ్మినా, తయారు చేసినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. అలాగే మొరుమురుకాలనీ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని యువతకు సూచించారు. గ్రామంలోకి అపరచితవ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

గుడుంబా పట్టివేత

గోవిందరావుపేట : అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పోలీసులు పస్రా చౌరస్తాలో పట్టుకున్నారు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. పస్రా చౌరస్తాలో రాత్రి ఓ మహిళ బ్యాగు పట్టుకొని అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా బ్యాగులో పది లీటర్ల గుడుంబా ఉన్నట్లు గుర్తించామన్నారు. దానిని స్వాధీనం చేసుకొని రాంనగర్ గ్రామానికి చెందిన జర్పుల కవితపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తేనెటీగల పెంపకంతో ఉపాధి

తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాడ్వాయి, మార్చి19 : తేనెటీగల పెంపకంతో ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఫారెస్టు కాలేజ్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిద్దిపేట అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ అన్నారు. మండలంలోని కామారం గ్రామానికి చెందిన ఆదివాసీలకు వనకుటీరాల్లో తేనెటీగల పెంపకంపై వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సుమారు 50మంది ఆదివాసీలకు తేనె టీగల పెంపకం తేనె సేకరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తేనె తయారీకి రూ.4,200 విలువైన 50 తేనెటీగల బాక్స్‌లను వారికి అందజేశారు. డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ పర్యవేక్షణలో తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించామన్నారు. వారు సక్రమంగా నిర్వహించుకుని ఉపాధి పొందితే మరికొందరికి బాక్స్‌లను అందజేస్తామన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో కృష్ణవేణి, సెక్షన్ ఆఫీసర్ స్వరూపారాణి, బీట్ అధికారులు రమ్యకృష్ణ పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు..

రౌడీ షీటర్లకు డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి హెచ్చరిక

మాట్లాడుతున్న కాటారం డీఎస్పీ రాంమోహ్మన్ రెడ్డి

కాటారం, మార్చి 19 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు ఎక్కడైనా గొడవలు సృష్టించినా, చట్టాన్ని అతిక్రమించినా చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో ఉంటే షీట్లు తొలగిస్తామని భరోసా ఇచ్చారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్, నరేశ్, మహేందర్, హరిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గొడవలు పెట్టుకున్నా కేసులు నమోదు చేస్తామని చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. మంగళవారం ఆయన చిట్యాల సర్కిల్‌లోని టేకుమట్ల, మొగుళ్లపల్లి, చిట్యాల స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

29వ వార్డు సుభాష్‌కాలనీలో పేరుకుపోయిన చెత్త

భూపాలపల్లిలో పడేకేసిన పారిశుధ్యం

భూపాలపల్లి రూరల్, మార్చి 19: భూపాలపల్లి పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుధ్యం పేరుకుపోయిది. సింగరేణి అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెత్త చెదారంపై ఈగలు, దోమలు వాలి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది. 29వ వార్డు సుభాష్‌కాలనీ జయశంకర్ పార్క్ ముందు ఉన్న డ్రైనేజీలో చెత్త తట్టుకోవడంతో డ్రైనేజీని ఓపెన్ చేసి ఉంచగా సోమవారం గేదె దూడ అందులో పడిపోయింది. స్థానికులు గమనించి తాడు సాయంతో బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. సుభాష్‌కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని సింగరేణి సూపర్ వైజర్‌కు, మున్సిపాలిటీ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించు కోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు చేపట్టకపోడంతో ఈగలు, దోమలు ఎక్కువై రోగాల బారీన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పారిశుధ్య సమస్యను తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.

తాత్కాలిక రోడ్డును తొలగిస్తున్న అధికారులు

తాత్కాలిక మట్టి రోడ్డు తొలగింపు

టేకుమట్ల, మార్చి19 : టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామాల మధ్య మానేరు వాగులో తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్డును మంగళవారం అధికారులు తొలగించారు. గర్మిళ్లపల్లికి చెందిన కొంత మంది అధికారికంగా అనుమతులు తీసుకోకుండా, రేణుక ఎల్లమ్మ గుడి పేరిట మట్టి రోడ్డు పోసి ప్రయాణికుల నుంచి అధికంగా డబ్బులు (రూ. 30 నుంచి రూ. 1000 వరకు) వసూలు చేయడంతో పాటు, ఇసుక అక్రమ రవాణకు రహదారిని వినియోగిస్తున్నారని, ఇసుక లారీలతో ప్రభుత్వ రోడ్లను ధ్వంసం చేస్తున్నారనే సమాచారంతో ముత్తారం మండల రెవెన్యూ, పోలీసు అధికారులు జేసీబీ సాయంతో రోడ్డును తవ్వి రాకపోకలను నిషేధించారు. కాగా, మండలంలోని బూర్నపల్లి, పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేట గ్రామాల మధ్య సైతం గట్టు మల్లన్న దేవుడి పేరుతో మట్టిరోడ్డు పోసి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇక్కడి అధికారులు కూడా స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు షురూ

స్వామి వారికి సింహవాహన సేవ.. నేడు కల్యాణం

సింహవాహన సేవలో పాల్గొన్న భక్తులు

రేగొండ, మార్చి 19 : భక్తులు పిలిస్తే పలికే దేవుడిగా పూజలందుకుంటున్న మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, నివేదనలు తదితర సేవా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తూపురాని బుచ్చమాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సింహవాహన సేవ నిర్వహించి, భాజాభజంత్రీలు మేళతాళాల మధ్య ఆలయ మాడ వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ చైర్మన్ మల్కనూరి భిక్షపతి, ఈవో బిళ్ల శ్రీనివాస్, సిబ్బంది కొంరాజు రవీందర్, గోరంటల శ్రావణ్, సుధాకర్, రవి, బోస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకు బీఆర్‌ఎస్‌లోనే..

ఆరు నూరైనా పార్టీని వీడేది లేదు.. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ, మార్చి 19 : ఆరు నూరైనా బీఆర్ఎస్‌ను వీడేది లేదని, తన ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్ లోనే ఉంటానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఓ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఖండిస్తున్నానని మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజ నిర్ధారణ లేని వార్తలు రాసి తనపై విష ప్రచారం చేయొద్దని మండిపడ్డారు. తాను తెలంగాణ తొలిముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోనే పని చేస్తానన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం తాను పని చేస్తున్నానన్నారు. నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని, రానున్న రోజుల్లో సమస్యలపై ప్రతిపక్ష పాత్ర పోషిస్తానన్నారు. కార్యకర్తల యోగ క్షేమాల్లో పాలు పంచుకుంటూ, నాయకుల సమన్వయంతో ముందుకు వెళ్తానన్నారు. తాను ఎన్నటికీ బీఆర్ఎస్‌ను వీడేది లేదని గండ్ర చెప్పారు.

మంత్రి సీతక్క ఓఎస్డీ ఇంట్లో చోరీకి యత్నం

విచారణ చేస్తున్న సీఐ, ఎస్సై

ఏటూరునాగారం, మార్చి 19 : మంత్రి సీతక్క ఓఎస్డీ నూతి మధుసూదన్ ఇంట్లో దొంగలు చోరీకి యత్నించారు. మధుసూదన్ హైదరాబాద్‌లో ఉంటుండగా సోమవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి ఏటూరునాగారంలోని ఆయన ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లోని కబోర్డులు, గదుల్లోకి వెళ్లి దొంగతనానికి యత్నించారు. కాగా, మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందగా సీఐ రాజు, ఎస్సై కృష్ణ ప్రసాద్ ఇంటిని పరిశీలించారు. వివరాలతోపాటు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.

జీపీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

మహదేవపూర్, మార్చి 19 : జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ప్రసాద్ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని పెద్దంపేట గ్రామంలో పర్యటించారు. గ్రామ పంచాయతీలోని రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్మశాన వాటిక, డంపింగ్ యార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హరితహారంలో నాటిన, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి సృజన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ఈకేవైసీ కోసం జనం బారులు

జీసీసీ కార్యాలయం ఎదుట బారులు తీరిన ప్రజలు

మహదేవపూర్, మార్చి 19 : మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ కార్యాలయం ఎదుట మంగళవారం హెచ్‌పీ గ్యాస్ ఈ కేవైసీ కోసం మహిళలు పెద్దసంఖ్యలో బారులు తీరారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లో జమచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ కేవైసీ చేసుకోని వారు కార్యాయాలనికి పోటెత్తారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సిలిండర్ డెలివరీ చేసే సమయంలో ఇంటి వద్దనే ఈ కేవైసీ పూర్తి చేయాలనే ఆదేశాలున్నప్పటికీ ఈ ప్రక్రియ జరగడం లేదు. దీంతో గ్యాస్ పథకానికి అర్హత కోల్పోతామనే భయంతో జీసీసీ కార్యాలయానికి వచ్చి గంటల తరబడి వేచి క్యూలో నిల్చుంటున్నారు. ఈ విషయమై జీసీసీ మేనేజర్ హరిలాల్‌ను వివరణ కోరగా వినియోగదారులకు గ్యాస్ డెలివరీ సమయంలో ఇంటి వద్దనే ఈ కేవైసీ చేసేందుకు డెలివరీ బాయ్స్‌కు యంత్రాలను అప్పగించామని, కార్యాలయానికి వచ్చి ఇబ్బంది పడొద్దని ఆయన సూచించారు.

ఏడుగురి బైండోవర్

గోవిందరావుపేట, మార్చి19 : పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట ఎస్సై కమలాకర్ బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల వేట కోసం ఎలక్ట్రిక్ తీగలను అమర్చుతున్నారనే సమాచారంతో వాసం శివాజి, జక్కు శంకర్, తల్లడి సోమయ్య, చెరుకుల వెంకటేశ్వర్లు, జక్కు రాజు, పన్నాల అభిలాష్, ఎర్రబోయిన కొమురయ్యను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సంబంధిత వ్యక్తులు మళ్లీ విద్యుత్ తీగలు అమర్చితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

కేటీకే ఓసీ-3 పీవోను కలిసిన నాయకులు

కేటీకే ఓసీ-3 పీవో భిక్షమయ్యకు పూల మొక్కను అందిస్తున్న మైనింగ్ స్టాఫ్ నాయకులు

గణపురం, మార్చి 19 : ఇటీవలె కేటీకే ఓసీ-3 ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వాసం భిక్షమయ్యను మంగళవారం మైనింగ్ స్టాఫ్ నాయకులు, గని సూపర్ వైజర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, సూపర్ వైజర్లు సుదర్శన్, కృష్ణమూర్తి, సదయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్‌బాబు, నరేందర్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ-జీడీకి ఉచిత గ్రౌండ్ శిక్షణ

భూపాలపల్లి రూరల్, మార్చి 19 : సైనిక్ సమాజ్ సురక్ష సమితి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో మాజీ సైనికులతో ఎస్ఎస్‌సీ-జీడీ మహిళా అభ్యర్థులకు ఉచిత గ్రౌండ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎక్స్ ఆర్మీ హవల్దార్ శ్యాం సుందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎస్ఎస్‌సీ-జీడీకి సన్నద్ధమవుతున్న మహిళా అభ్యర్థులు మార్చి 24 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 26 నుంచి ఫిజికల్ శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 8309435264, 90554440, 8886304040 నంబర్లను సంప్రదించాలని, అర్హులైన మహిళలు వినియోగించుకోవాలని వారు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన బైక్

కాటారం, మార్చి 19 : మండలంలోని మద్దులపల్లి శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లికి చెందిన తోటపల్లి అక్షయ పదో తరగతి పరీక్ష రాయడానికి తన సోదరులు రాజేశ్, తరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మద్దులపల్లి శివారులో అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టారు. దీంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడిన అక్షయను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్షయ ప్రస్తుతానికి అపస్మారక స్థితిలో ఉంది. ప్రమాదంలో స్వల్పంగా గాయాలైన తరుణ్, రాజేశ్‌లను 108 వాహనంలో భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

రామప్పలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

2002-07 పదో తరగతి విద్యార్థులు

వెంకటాపూర్, మార్చి 19 : రామప్ప దేవాలయ సమీపంలో జంగాలపల్లి ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల జీవితంలో గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. కష్ట సుఖాల్లో అందరం కలిసి మెలిసి ఉండాలని, ఒకరికి తోడుగా ఉంటూ సహాయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అచ్చునూరి కిషన్, మేకల వంశీ, బుర్ర వెంకటేశ్, ఎస్ మహేశ్, అశోక్, బాషా, సాయి కిరణ్, ప్రమోద్, శ్రీనివాస్, శ్రీమాన్, రాజేశ్, మహేష్, కృష్ణ, భావన్, తులసిరాం, సురేశ్, రోజా, కవిత, మహాలక్ష్మి, లలిత, రాధిక, సుమలత, స్వాతి, సృజన పాల్గొన్నారు.